
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
మంగళవారం, 11, ఫిబ్రవరి, 2025



సోమశిలలో 64.566 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో సోమవారానికి 64.566 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయం నుంచి వివిధ కాలువలకు 4000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.88,450
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.7,998
3 శాతం జీఎస్టీతో	రూ.8,238
నవర (8 గ్రా)	రూ.65,904

గరిష్టం/కనిష్టం
32.7 /24.0

వాతావరణం

జిల్లాలో వాతావరణం మంగళవారం పొడిగానే ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ సోమవారం 64 శాతంగా నమోదైంది.

వదలని సీట్లు.. కదలని ఫైళ్లు

ఏళ్ల తరబడి కలెక్టరేట్‌లో ఒకే సీటులో తిష్టవేసిన ఉద్యోగులు

- ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ సెక్షన్లలో కొందరి చేతుల్లోనే ఫైళ్లు
- కలెక్టర్, జేసీ, డీఆర్వోల వద్దకు పెండింగ్ ఫైళ్లు పంపకుండా దుమ్ము పట్టిస్తున్న వైనం
- సంబంధిత సెక్షన్ ఇన్‌చార్జి వరకు ముడుపులు ఇస్తేనే ఆ ఫైళ్లకు చలనం
- ఆయా సెక్షన్లలో ఏళ్లనాటి ఫైళ్లు గుట్టలు గుట్టలు
- కొన్ని ఫైళ్లు గల్లంతైనట్లు సమాచారం

కలెక్టర్ కార్యాలయం





ధన, రాజకీయ పలుకుబడితో ప్రభుత్వానికి చెందిన సీలింగ్, ఇనాం భూములు కొందరు ఆక్రమించుకుంటున్నారు. ప్రజావసరాల కోసం ప్రభుత్వం సేకరించే భూములకు సరైన పరిహారం దక్కలేదనో, తమ భూములు డాట్ ల్యాండ్స్‌గా ఉండిపోయాయనో.. పిత్రార్జితంగా వచ్చిన భూములకు పట్టాదారు పుస్తకాలు మంజూరు చేయాలనో.. ఇలాంటి ఫైళ్లు వేలకు వేలు కలెక్టరేట్‌లోని కొన్ని సెక్షన్లలో గుట్టలు గుట్టలుగా పేరుకుపోతున్నాయి. క్షేత్రస్థాయిలో పరిష్కారానికి నోచుకోని తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తే పరిష్కారమవుతుందని ఎంతో ఆశతో వచ్చి ఇచ్చిన ఫిర్యాదుల ఫైళ్లకు ఏళ్ల తరబడి మోక్షం లభించడం లేదు. ఇందుకు ప్రధాన కారణం ఆయా సెక్షన్లలో ఏళ్ల తరబడి తిష్టవేసిన కొందరు ఉద్యోగులు, అధికారులే.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: కలెక్టరేట్‌లో ఏళ్ల తరబడి ఒకే సీటుకు అతుక్కుపోయిన కొందరు ఉద్యోగులను ప్రసన్నం చేసుకుంటేనే ఏ ఫైల్ అయినా కలెక్టర్, జేసీల ముందుకు వెళ్తాయి. లేదంటే మూలన పడిపోతోంది. దేవుడు వరమిచ్చినా.. పూజారి కరుణించని చందంగా పరిస్థితి మారుతుంది. దాదాపు 15 ఏళ్లుగా వీళ్లు కలెక్టరేట్‌లోని కీలక సెక్షన్లలో అటూ ఇటూ మారుతున్నారే కానీ.. వారి పెత్తనంలో మాత్రం మార్పులేదు. గత కొన్నేళ్లుగా కలెక్టరేట్ నుంచి మోక్షం లభించని ఫైళ్లు కొన్ని వేలల్లో ఉన్నాయి. ప్రధానంగా ల్యాండ్, అడ్మినిస్ట్రేషన్ సెక్షన్లలో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది. ఆయా సెక్షన్లలో ఏళ్ల తరబడి పాతుకుపోయిన ఉద్యోగులు, అధికారులు ఫైళ్లను కలెక్టర్, జేసీ, డీఆర్వోల ముందు పెట్టడం లేదు. ఒక వేళ వెళ్లినా.. చర్యలు తీసుకోవాలంటూ సంబంధిత అధికారులకు పంపాలని ఆదేశాలిచ్చినా.. ఆ ఫైళ్లు పెండింగ్ ఫైళ్ల గుట్టలో పడేస్తున్నారు. ఈ ఫైళ్లకు సంబంధించిన వ్యక్తులు సదరు సెక్షన్ అధికారులు అడిగింది ఇచ్చుకుంటే కింది స్థాయి వరకు ఫైళ్లు కదులుతాయి. పరిష్కారం అయ్యే వరకు పర్యవేక్షిస్తుంటారు. ఇటీవల జాయింట్ కలెక్టర్ కార్తీక్ పెండింగ్ ఫైళ్ల విషయమై కొన్ని సెక్షన్ల అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఏ ఫైల్ ఎంత కాలంగా పెండింగ్ ఉందో.. ఎన్ని పెండింగ్ ఉన్నాయి.. కారణాలతో నోట్ ఫైల్ తయారు చేసి తన ముందు ఉంచాలని ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.

1200 వరకు పెండింగ్

కలెక్టరేట్‌లో భూ వ్యవహారాలు చూసేందుకు ఆత్మకూరు, నెల్లూరు, కందుకూరు, కావలి డివిజన్లకు సంబంధించి సెక్షన్లున్నాయి. ఇతర అడ్మినిస్ట్రేషన్ వ్యవహారాలు పర్యవేక్షించేందుకు మరో విభాగం ఉంది. భూ వ్యవహారాలకు సంబంధించి 1100కు పైగా, ఇతర పరిపాలనా వ్యవహారాలకు సంబంధించి 100కి పైగా ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నట్లు కలెక్టరేట్ విశ్వసనీయ వర్గాల సమాచారం.

ఫైళ్లు మాయం

మర్రిపాడు మండలం పొంగూరుకు చెందిన ఓ రైతుకు 5.20 ఎకరాల చుక్కల భూమి ఉంది. ఆ సమస్యకు విముక్తి కల్పించాలని కోరుతూ మూడేళ్ల క్రితం నుంచి ఫైల్ నడిపాడు. గ్రామంలో వీఆర్వో వెరిఫై చేసి ఫైల్ తహసీల్దార్‌కు పంపాడు. అక్కడి నుంచి ఆర్డీఓకు ఫైల్ పంపారు. అందరూ పరిశీలించారు. ఈ క్రమంలో సదరు రైతు రూ.2 లక్షల మేర అధికారులకు సమర్పించుకున్నాడు. ఎట్టకేలకు అధికారుల ద్వారా రెండేళ్ల తర్వాత ఫైల్ కలెక్టరేట్‌కు చేరింది. వీఆర్వో, తహసీల్దార్, ఆర్డీఓలు పరిశీలించి కలెక్టరేట్‌కు పంపిన ఫైల్ జేసీ ముందుకు రాకుండా కలెక్టరేట్‌లోని ఒక ఉద్యోగి అడ్డుకున్నారు. ఏదో కొర్రీలు పెట్టి పక్కన పెట్టేశాడు. రెండు నెలల క్రితం ఆ ఫైల్ కనిపించడం లేదని ఆ రైతుకు ఆ ఉద్యోగి చావు కబురు చల్లగా చెప్పాడు. మళ్లీ ఫైల్‌ను గ్రామ స్థాయి నుంచి నడుపుకోవాలని తెలిపాడు. దీంతో ఆ రైతు పడిన బాధ మాటల్లో చెప్పలేనిది.

➡ జలదంకి మండలానికి సంబంధించి మరొకరి ఫైల్ కూడా మాయం అయినట్టు తెలిసింది.

ఈ ఫైళ్లకు మోక్ష మెప్పుడో!

రాపూరు మండలం బండేపల్లికి చెందిన 74 ఏళ్ల షేక్ సుభాన్ పక్షవాతానికి గురయ్యాడు. ఊతకర్రతో నడవలేక నడుస్తున్నాడు. కొన్నేళ్ల క్రితం ఆయనకు ప్రభుత్వం ఇంటి స్థలాన్ని కేటాయించింది. అందులో ఓ చిన్న గుడిసె వేసుకుని జీవిస్తున్నాడు. ఆ స్థలానికి అటూ ఇటూ ఉన్న వాళ్లు ఈ వృద్ధుడు వెళ్లే దారిని మూసివేశారు. రోడ్డును ఆక్రమించారని, న్యాయం చేయాలని తహసీల్దార్ నుంచి కలెక్టరేట్ వరకు తిరిగి వేశారిపోయాడు. సోమవారం సైతం కలెక్టరేట్‌కు వచ్చి మెట్లు ఎక్కలేక పడి రక్తగాయాల పాలయ్యాడు. అలా రక్తగాయాలతో కలెక్టరేట్‌లో అర్జీ ఇచ్చి ఇక తాను తిరగలేనని వేడుకున్నాడు. ఆయన అర్జీ ఇచ్చినప్పుడల్లా సమస్య పరిష్కరించినట్టు కలెక్టరేట్ రికార్డుల్లో నమోదు చేశారు. వాస్తవానికి సమస్య అలాగే ఉంటోంది.



షేక్ సుభాన్

➡ నెల్లూరు రూరల్ మండలం అల్లీపురం గ్రామానికి చెందిన కసుమర్లపూడి సుబ్బారావుకు గ్రామ సర్వే నంబర్ 269బీలో 2 ఎకరాల పైచిలుకు భూమి ఉంది. ఆ రైతుది పక్కాగా పట్టాభూమి. అయితే రైతుకు తెలియకుండా ఆ భూమిని నోషనల్ ఖాతాలో చేర్చారు. సర్వేయర్ ఎలా చేర్చారో రైతుకే తెలియదు. ఆయనకు నోటీసు కూడా ఇవ్వకుండా చట్ట విరుద్ధంగా ఇలా చేర్చారు. రెవెన్యూ అధికారులు చేసిన తప్పును సరి చేయాలని ఆరు నెలలుగా తహసీల్దార్, ఆర్డీఓ, కలెక్టరేట్ అధికారుల చుట్టూ తిరుగుతున్నాడు. అందుకు సంబంధించిన ఫైల్ కొన్ని నెలలుగా కలెక్టరేట్‌లో సంబంధిత క్లర్క్ వద్ద ఉంది. ఆ ఫైల్ అక్కడి నుంచి ముందుకు కదలడం లేదు.

➡ నాలుగు నెలల క్రితం ఆత్మకూరు నియోజకవర్గంలోని ఒక ఎస్సీ బాలికపై అత్యాచారం జరిగింది. ఆమెకు ప్రభుత్వం నుంచి పరిహారం నగదు ఇవ్వాల్సి ఉంది. ఆ ఫైల్‌ను కలెక్టర్ ముందు పెట్టాల్సిన సదరు సెక్షన్ అధికారులు పెండింగ్ ఫైళ్ల గుట్టలో పడేశారు.

బదిలీ చేసినా.. మళ్లీ ఇక్కడికే..

కొంతమంది కలెక్టరేట్‌లో ఏళ్ల తరబడి కుర్చీలను వదలడం లేదు. అధికారులు వారిని బదిలీ చేసినా పలుకుబడి ఉపయోగించి మళ్లీ కలెక్టరేట్‌లోనే ప్రత్యక్షమవుతున్నారు. వారికెదురే లేకుండా పోతోంది. కలెక్టరేట్ భూ వ్యవహారాల విభాగంలో ఆర్ఎస్ డీటీగా పనిచేస్తున్న ఓ ఉద్యోగి 10 ఏళ్లకు పైగా కలెక్టరేట్‌లోనే విధులు నిర్వర్తిస్తున్నాడు. వాస్తవానికి ఆయన్ను ఇటీవల వెంకటాచలానికి బదిలీ చేశారు. అయితే అంతే వేగంతో తిరిగి డిప్యుటేషన్‌పై మళ్లీ కలెక్టరేట్‌లో పాతసీటులోనే కూర్చున్నాడు. ఆయన క్షేత్రస్థాయిలో సర్వేకు గ్రామాల్లోకి వెళ్లాలి. ఆ పని చేయడం లేదు. కుర్చీని వదలడం లేదు.

➡ మరో మినిస్ట్రీరియల్ ఉద్యోగి 15 ఏళ్లకు పైగా అడ్మినిస్ట్రేషన్ అధికారికి ఎదురుగా ఉండే సెక్షన్‌లో ఒకే చోట విధులు నిర్వర్తిస్తున్నాడు. రెవెన్యూ ఉద్యోగులు, ఇతర పనులకు సంబంధించి ఆయన అంత త్వరగా ఫైల్‌ను డీఆర్వో, జేసీ వద్దకు తీసుకెళ్లడని సాటి ఉద్యోగులే పేర్కొంటున్నారు. ఫైల్ ముందుకు కదలాలంటే ఆయనతో అంత ఈజీ కాదంటున్నారు.

➡ మరో డిప్యూటీ తహసీల్దార్ కలెక్టరేట్‌లో ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయన ఇప్పటికే మూడు ఎన్నికల నుంచి అదే సీట్లో ఉన్నారు. మరో మహిళా ఉద్యోగి కూడా ఏళ్ల తరబడి కుర్చీని వీడడం లేదు.

ఇలా తిష్టవేసి ప్రజల సమస్యలను గాలికొదిలేస్తున్నారు. కలెక్టర్, జేసీలకు కూడా సరైన సమాచారం ఇవ్వకుండా తప్పుదారి పట్టిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. దీనికి తోడు ఆయా సెక్షన్లలో ఉండే సిబ్బంది ఫైళ్లను గందరగోళం చేస్తున్నారు. కొత్త వారు ఆ సీట్లోకి వస్తే అర్థం కాని విధంగా గజిబిజిగా మారుస్తున్నారు. ఈ నేపథ్యంలో తప్పని పరిస్థితుల్లో మళ్లీ పాత వారిని పిలిపించుకుని ఫైళ్లు క్లియర్ చేయించుకునే పనిలో కలెక్టర్, జేసీలు ఉన్నారని సమాచారం.

ఫైళ్లు పెండింగ్‌లో లేవు

కలెక్టరేట్‌లో ఫైళ్లు పెండింగ్‌లో లేవు. ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం. కారుణ్య నియామకాలకు సంబంధించి నెలలోపు బాధితులకు ఉద్యోగాలు కూడా ఇచ్చాం. ఇంతకన్నా వేగంగా ఎవరు చేస్తారు. అయితే రీ సర్వేలో క్షేత్రస్థాయిలో కొన్ని లోపాలు జరిగిన మాట వాస్తవమే. వాటన్నింటిని వేగవంతంగా పరిష్కరిస్తున్నాం. కలెక్టర్, జేసీ స్పెషల్ డ్రైవ్ పెట్టి ఫైళ్లను పెండింగ్ లేకుండా చేస్తున్నారు. లాంగ్ స్టాండింగ్‌లో ఎవరూ లేరు. ఇద్దరి, ముగ్గురిని వర్క్ అడ్జెస్ట్ కోసం కలెక్టరేట్‌లో డిప్యుటేషన్‌పై తాత్కాలికంగా తీసుకున్నాం.

– ఉదయభాస్కర్‌రావు, డీఆర్వో, నెల్లూరు

న్యూస్‌రీల్

దుర్గంపై కూంబింగ్



కూంబింగ్‌కు బయల్దేరుతున్న పోలీసు, అటవీశాఖ సిబ్బంది

ఉదయగిరి: ఉదయగిరి దుర్గంపై సోమవారం పోలీసు, అటవీ శాఖ అధికారులు, సిబ్బంది కూంబింగ్ నిర్వహించారు. మూడు రోజులుగా రాత్రి వేళల్లో దుర్గం కొండపై దీపాల వెలుగులు కనిపిస్తున్న నేపథ్యంలో గుప్త నిధుల ముఠా తవ్వకాలు జరుపుతున్నారనే అనుమానం నేపథ్యంలో ఈ గాలింపు చర్యలు చేపట్టారు. ఈ విషయం ప్రసార మాధ్యమాల్లో రావడంతో ఉదయగిరి సీఐ వెంకట్రావు, ఎస్సై ఇంద్రసేనారెడ్డి, రేంజ్ అధికారి డీఎస్ కుమార్‌రాజా ఆధ్వర్యంలో పోలీసులు, అటవీశాఖ సిబ్బంది దుర్గంపైకి ఎక్కి గాలింపు చర్యలు చేపట్టారు. అక్కడ గతంలో గుప్తనిధులు కోసం తవ్విన గుంతలు తప్ప కొత్తగా ఏమీ కనిపించడం లేదని అధికారులు చెబుతున్నారు. రెండు, మూడు రోజుల నుంచి రాత్రి వేళల్లో వెలుగులు ఎందుకు కనిపిస్తున్నాయోననే అనుమానాలు స్థానికుల్లో ఉన్నాయి. పోలీసు, అటవీ శాఖ సిబ్బంది పూర్తిస్థాయిలో గాలింపు చర్యలు చేపడితే తవ్వకాలు బయటపడొచ్చని స్థానికులు చెబుతున్నారు.

ప్రశాంతంగా ఇంటర్ ప్రాక్టికల్స్



నారాయణ కళాశాలలో ప్రాక్టికల్స్‌ను తనిఖీ చేస్తున్న ఆర్ఐఓ శ్రీనివాసులు

నెల్లూరు (టౌన్): ఇంటర్మీడియట్ జనరల్ ప్రాక్టికల్స్ సోమవారం ప్రశాంతంగా జరిగాయి. తొలి రోజు 228 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఉదయం జరిగిన ప్రాక్టికల్స్‌కు 4,267 మందికి 4,136 మంది హాజరయ్యారు. 131 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నుంచి జరిగిన ప్రాక్టికల్స్‌కు 3,121 మందికి 3,024 మంది హాజరయ్యారు. 97 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఆర్ఐఓ శ్రీనివాసులు 11 కేంద్రాలను తనిఖీ చేయగా, డీఈసీ కమిటీ సభ్యులు 9 కేంద్రాలను పరిశీలించారు.

టెన్త్ పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు



మాట్లాడుతున్న డీఆర్ఓ విజయభాస్కర్‌రావు

నెల్లూరు రూరల్: మార్చి 17 నుంచి ప్రారంభమయ్యే 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని డీఆర్వో జె విజయభాస్కర్‌రావు సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం డీఆర్ఓ తన చాంబర్‌లో 10వ తరగతి పరీక్షల నిర్వహణకు సంబంధించి అధికారుల సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు నిర్వహించే ఈ పరీక్షలకు జిల్లాలో మొత్తం 33,434 మంది విద్యార్థిని విద్యార్థులు హాజరవుతున్నట్లు డీఈఓ బాలాజీరావు వివరించారు. మొత్తం 1,622 మంది ఇన్విజిలేటర్లను నియమించామన్నారు. పరీక్షల నిర్వహణకు జిల్లాలో 174 కేంద్రాలను ఏర్పాటు చేశామని, వీటిలో 16 కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించినట్లు వివరించారు. డీఆర్ఓ ఉదయభాస్కర్‌రావు మాట్లాడుతూ ఆయా పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఒకేషనల్ విద్యాధికారి మధుబాబుతో పాటు పోలీస్, ఆర్టీసీ, విద్యుత్, వైద్యశాఖల అధికారులు పాల్గొన్నారు.

5,43,743 మందికి ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

నెల్లూరు(అర్బన్): జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం జిల్లాలో 1 నుంచి 19 ఏళ్లలోపు 5,43,743 మంది పిల్లలకు ఆల్‌బెండజోల్ మాత్రలు మింగించారు. జిల్లాలో 5,75,380 మంది పిల్లలు ఉన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో తొలిరోజు 94.5 శాతం మందికి పిల్లలతో మాత్రలు మింగించారు. డీఎంహెచ్ఓ సుజాత మాట్లాడుతూ మిగతా పిల్లలకు కూడా మంగళవారం మాత్రలు మింగించి 100 శాతం లక్ష్యాన్ని చేరుకుంటామన్నారు.

స్వచ్ఛాంధ్రపై ప్రత్యేక శ్రద్ధ పెట్టండి

- ఉపాధి పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు
- కలెక్టర్ ఆనంద్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు రూరల్: ప్రతి నెలా 3వ శనివారం అన్ని శాఖల అధికారులు స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరం నుంచి మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా ఇంకుడు గుంతల నిర్మాణం, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావడం, గ్రామ పంచాయతీల్లో సామాజిక మరుగుదొడ్ల భవన నిర్మాణాలను పూర్తి చేయడంపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. తడి, పొడి చెత్తను వేరుగా సేకరించడం, బ్లూ, రెడ్, గ్రీన్ డస్ట్‌బిన్లను ప్రజలకు అందించడం వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. జిల్లాలోని చాలా మండలాలు ఉపాధి హామీ పనుల కల్పనలో బాగా వెనుకబడి ఉన్నాయని, ఇకపై 70 నుంచి 80 శాతం తగ్గకుండా పనులు కల్పించేందుకు ఎంపీడీఓలు, ఏపీఓలు లక్ష్యం నిర్దేశించుకుని పని చేయా లన్నారు. ఎవరైనా నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. సచివాలయాల పరిధి లో ఎంఎస్ఎంఈ సర్వే హౌస్‌హోల్డ్ సర్వేలో వేగం పెంచాలన్నారు. పీఎం సూర్యఘర్ యోజన పథకంపై పూర్తిస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జెడ్పీ సీఈఓ విద్యారమ, డ్వామా పీడీ గంగాభవాని, డీపీఓ శ్రీధర్‌రెడ్డి, విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈలు విజయ న్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బాలో ఉమెన్ ఫోర్స్ పర్యటన

కావలి: పట్టణంలోని ముసునూరులో ఉన్న కస్తూర్బా బాలికా విద్యాలయంలో సోమవారం ఉమెన్స్ ఫోరం బృందం పర్యటించింది. విద్యాలయంలో శనివారం అర్ధరాత్రి ముగ్గురు ఆగంతకులు ముసుగులు ధరించి, మారణాయుధాలతో దూరి తెల్లవారు జాము వరకు కీచక కాండకు పాల్పడిన విషయం వెలుగులోకి రావడంతో ఉమెన్స్ ఫోరం బృందం కన్వీనర్ సి. శారదతోపాటు సభ్యులు ఇలీంద్ర లావణ్య, షేక్ ఫాతిమా, టీ సుజాత, షేక్ బుష్రా విద్యాలయం పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులతోపాటు ప్రిన్సిపల్ సంధ్యారాణి, ఉపాధ్యాయులు, సిబ్బందితో మాట్లా డారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఈ ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. 260 మందికిపైగా విద్యార్థినులు ఉండే ఈ పాఠశాల ఊరి చివరగా పడమటి నిర్మానుష్య ప్రాంతంలో విసిరేసినట్లు ఉందని తెలిపారు. 24/7 విద్యార్థులకు రక్షణ కల్పించాలని, ఆడపిల్లలపై అవాంఛనీయ ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు డార్మెటరీ లేకపోవడంతో తరగతి గదుల్లో, డైనింగ్ హాల్‌లో నిద్రించాల్సి వస్తుందన్నారు. శనివారం రాత్రి ఘటనలో ఆగంతకులు విద్యార్థినుల జడలు లాగి ఒకడు పైనబడి అరాచకం చేసినట్లు తెలిసిందన్నారు. ప్రిన్సిపల్ సంధ్యారాణి మాట్లాడుతూ బాలికలు ఉండే రెసిడెన్షియల్ స్కూల్ ఊరవతల ఉండడం భద్రత కాదని ఉమెన్స్ ఫోరం ప్రతినిధులు చెప్పినట్లు వివరించారు. ఇద్దరు వాచ్ ఉమన్, ఇద్దరు కుక్స్, ఇద్దరు టీచర్లకు మార్చి మార్చి డ్యూటీలు వేస్తుంటామని తెలిపారు. ఉమెన్స్ ఫోరం కన్వీనర్ సి. శారదతో కలిసి వెళ్లిన ప్రతినిధులు పిల్లలతో మాట్లాడి ధైర్యం చెప్పారు. గట్టి నిఘా ఏర్పాటు చేయడంతోపాటు ఆగంతకులను తక్షణమే పట్టుకోవాలని పోలీసులను కోరారు. ఈ విషయం తెలుసుకున్న కావలి ఎమ్మెల్యే కృష్ణారెడ్డి కస్తూర్బా స్కూల్‌ను సందర్శించారు. నిర్మానుష్య ప్రదేశంలో ఉన్న ఆ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థినులకు రాత్రింబవళ్లు రక్షణ కల్పించేందుకు ఇద్దరు కానిస్టేబుల్స్‌కు రాత్రి డ్యూటీ వేసి బందోబస్త్ ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు.

ఇద్దరు విద్యార్థినులకు అస్వస్థత



చికిత్స పొందుతున్న మహిత, శ్రీరూప

కలిగిరి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థినులు సోమవారం అస్వస్థతకు గురయ్యారు. ఉదయం 11 గంటల సమయంలో శ్రీరూప తరగతి గదిలో ఒక్కసారిగా శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు తలెత్తి సొమ్మసిల్లి పడిపోయే స్థితికి చేరుకుంది. అదే సమయంలో మహిత అనే విద్యార్థిని గుండె నొప్పిగా ఉందని చెప్పింది. ఉపాధ్యాయులు ఆ ఇద్దరిని వెంటనే కలిగిరిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లారు. వైద్యాధికారి సద్దాం, వైద్యసిబ్బంది విద్యార్థినులకు చికిత్స అందజేశారు. శ్రీరూప జలుబు, దగ్గు కారణంగా శ్వాస తీసుకోలేక పోయిందని, మహితకు గ్యాస్ట్రిక్ కారణంగా గుండెలో నొప్పి వచ్చినట్లు వైద్యులు తెలిపారు. చికిత్స అనంతరం కొద్దిసేపటికి సాధారణ స్థితికి చేరుకున్నారు. పీహెచ్‌సీకి చేరుకున్న కుటుంబ సభ్యులు విద్యార్థినులను ఇళ్లకు తీసుకువెళ్లారు.

మద్యం దుకాణాలకు లక్కీడిప్



లక్కీడిప్ తీస్తున్న జాయింట్ కలెక్టర్ కార్తీక్

నెల్లూరు (క్రైమ్): గీత కార్మిక సామాజిక వర్గానికి జిల్లాలో కేటాయించిన 18 మద్యం దుకాణాలకు లక్కీడిప్ ప్రక్రియ ముగిసింది. 18 దుకాణాలకు 151 మంది 215 దరఖాస్తులు దాఖలు చేశారు. అధికారుల పరిశీలన అనంతరం సోమవారం నగరంలోని జెడ్పీ సమావేశ మందిరంలో జేసీ కార్తీక్ లక్కీడిప్ ప్రక్రియతో మద్యం దుకాణాలను కేటాయించారు. నెల్లూరు కార్పొరేషన్‌లో ఒక దుకాణానికి అత్యధికంగా 30 దరఖాస్తులు దాఖలు కాగా కావలి, ఆత్మకూరు మండలాల నుంచి అత్యల్ప సంఖ్యలో మూడు చొప్పున దరఖాస్తులు దాఖలయ్యాయి. దుకాణాలు దక్కించుకున్న వ్యాపారులు లైసెన్సు ఫీజును చెల్లించి ప్రొవిజినల్ లైసెన్సులను పొందారు. నెల్లూరు దుకాణాన్ని వి.వరమణి, ఆత్మకూరు మున్సిపాల్టీలోని దుకాణాన్ని కె. వసుంధర, ఆత్మకూరు మండలంలోని దుకాణాన్ని బి. అనూష దక్కించుకున్నారు. దరఖాస్తుల రూపేణా రూ.4.30 కోట్లు ప్రభుత్వ ఖజానాకు ఆదాయం వచ్చింది. లక్కీడిప్‌లో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ టి. శ్రీనివాసరావు, జిల్లా అధికారి ఎ. శ్రీనివాసులనాయుడు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ మార్కుల మెమో అందజేత

సాక్షి ఎఫెక్ట్..



బాధిత విద్యార్థికి ఇంటర్ మార్క్‌లిస్ట్ అందజేస్తున్న ఆత్మకూరు ఆర్డీఓ

ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణంలోని బీఎస్సార్ కళాశాలలో చదివిన కాటేపల్లి సురేంద్ర అనే విద్యార్థికి ఎట్టకేలకు ఇంటర్ మార్కుల ఒరిజినల్ మెమోను కళాశాల యాజమాన్యం సోమవారం సాయంత్రం అందజేసింది. కళాశాలకు రూ.20 వేలు ఫీజు బాకీ ఉన్నాడని, ఇంటర్మీడియట్ మార్కుల జాబితా ఇవ్వని విషయం తెలిసిందే. ఈ విషయమై గత మంగళవారం 'సర్టిఫికెట్లు ఇవ్వకుండా' అనే శీర్షికన 'సాక్షి'లో వచ్చిన కథనంపై స్పందించిన ఆర్డీఓ కళాశాల యాజమాన్యానికి ఫోన్ చేసి ప్రభుత్వ నిబంధనల మేరకు ఫీజు బకాయిలు ఉన్నా సర్టిఫికెట్లు ఇవ్వకపోవడం నేరమని, వెంటనే ఆ విద్యార్థికి సర్టిఫికెట్ అందజేయాలని లేకపోతే కేసు నమోదు చేయడంతోపాటు కళాశాల రిజిస్ట్రేషన్ నిలిపివేస్తామని హెచ్చరించారు. ఈ క్రమంలో సోమ వారం సాయంత్రం కళాశాల ఉద్యోగి ఖాజా ఇంటర్మీడియట్ ఒరిజినల్ మార్కుల మెమోను ఆర్డీఓ ద్వారా విద్యార్థికి అందజేశారు. ఆర్డీఓ పావని బాధిత విద్యార్థిని కార్యాలయానికి పిలిపించి సర్టిఫికెట్ అందజేశారు.

మైనింగ్ అనుమతులు రద్దు చేయండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

వరికుంటపాడు: మండలంలోని వరికుంటపాడు, జంగారెడ్డిపల్లి సమీపంలోని తిప్పపై సుమారు 43 ఎకరాల్లో ఇచ్చిన క్వార్ట్జ్, మైనింగ్ అనుమతులను రద్దు చేయాలని సోమవారం పలువురు గ్రామస్తులు తహసీల్దార్ హేమంత్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ తమ గ్రామాల పశువులకు మేత పొరంబోకుగా తిప్ప ప్రాంతం ఉందన్నారు. సమీపంలో గృహాలు కూడా ఉన్నాయన్నారు. మైనింగ్ అనుమతులు ఇవ్వడంతో అనేక ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. అధికారులు స్పందించి మైనింగ్ అనుమతులు రద్దు చేసి తమను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్. నాగరాజు, జి కాంతయ్య, ఎస్ రామయ్య, ఎస్ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

వినతులిచ్చి.. ఆదుకోవాలని కోరి.. న్యాయం కోసం తిరుగుతూ..

- 'కలెక్టరేట్‌లో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'
- 409 వినతుల అందజేత
- పింఛన్ పెంచాలని కళాకారుల వినూత్న నిరసన
- ఇళ్ల స్థలాల కోసం ధర్నా


జేసీకి వినతిపత్రం అందజేసిన కళాకారులు

నెల్లూరు రూరల్: ఈ సోమవారం కూడా ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అర్జీదారులు పోటెత్తారు. వినతులిచ్చి ఆదుకోవాలని ఉన్నతాధికారులను కోరారు. నెల్లూరులోని కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జేసీ కార్తీక్, డీఆర్వో ఉదయభాస్కర్‌రావు, జెడ్పీ సీఈఓ విద్యారమ, డ్వామా పీడీ గంగాభవాని, డీపీఓ శ్రీధర్‌రెడ్డి అర్జీలు స్వీకరించారు. 409 అర్జీలను ప్రజలు అందజేశారు. వీటిలో ఎక్కువగా రెవెన్యూ శాఖకు సంబంధించి 160, మున్సిపల్ శాఖవి 31, పోలీస్ శాఖవి 93, సర్వేవి 33, పంచాయతీరాజ్ శాఖవి 16 తదితర శాఖలకు సంబంధించినవి ఉన్నాయి.

కొన్ని..

- ఆత్మకూరులో పంట కాలువలు, అలుగు వాగు, శ్మశాన భూములను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పందింటి సుబ్బయ్య ఆధ్వర్యంలో పలువురు దళిత నేతలు కోరారు.
- వేదాయపాళెం రెవెన్యూ పరిధిలో స్థలానికి పట్టా సృష్టించి అమ్మకానికి పెట్టిన రిటైర్డ్ సివిల్ సప్లయీస్ ఉద్యోగి పోగల భరణీకృష్ణపై చర్యలు చేపట్టాలని చేకూరి సురేష్ అనే వ్యక్తి కోరాడు.

పాఠశాలను అప్‌గ్రేడ్ చేయాలంటూ..

మనుబోలు మండలం చెర్లోపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో 6 నుంచి 8వ తరగతి వరకు తొలగిస్తే పిల్లలు నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న మనుబోలు జెడ్పీ హైస్కూల్‌కు వెళ్లాల్సి వస్తుంది. అందువల్ల చెర్లోపల్లి స్కూల్‌ను అప్‌గ్రేడ్ చేయాలని మాజీ ఎంపీటీసీ సభ్యుడు కె.వెంకటేశ్వర్లు కోరారు. వంద మంది విద్యార్థులున్నారని, వారి కోసం తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో దేవదానం, సీపీఎం మనుబోలు కార్యదర్శి మహేష్ పాల్గొన్నారు.

పింఛన్ల పెంపు కోసం..

పింఛన్‌ను రూ.6 వేలకు పెంచాలంటూ ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ఉన్న వృత్తి కళాకారులు జేసీకి వినతిపత్రం అందజేశారు. పలువురు కళాకారులు వివిధ వేషధారణల్లో వచ్చారు. కొందరు డప్పు కొట్టి తమ ఆవేదనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం ఇస్తున్న రూ.4 వేలు సరిపోవడం లేదన్నారు. పొరుగు రాష్ట్రాల్లో రూ.6 వేలు ఇస్తున్నారని, తమను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఈ సంఘం జిల్లా అధ్యక్షుడు టీవీ కృష్ణదాసు, ప్రధాన కార్యదర్శి వడ్డే చక్రపాణి, జిల్లా కోశాధికారి తల్లు శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

నాసిరకం తినుబండారాల విక్రయంపై..


మాట్లాడుతున్న వెంకటరమణయ్య

నాసిరకం శీతల పానీయాలు, తినుబండారాలు, నాణ్యతా ప్రమాణాల్లేని ఆహార పదార్థాలను అధిక ధరలకు విక్రయిస్తున్న వారిపై చర్యలు చేపట్టాలని న్యాయవాది, బహుజన ప్రజా సంఘం అధ్యక్షుడు ఇర్ల వెంకటరమణయ్య వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఫుడ్ సేఫ్టీ అధికారుల ద్వారా తనిఖీలు చేపట్టి ప్రజల ఆరోగ్యానికి భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాది ఆవుల భానుప్రకాష్, సంఘం నాయకులు కోవూరు బాబూరావు, హరి విష్ణు తదితరులు పాల్గొన్నారు.

- ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'
- 98 ఫిర్యాదుల అందజేత


సమస్యను పరిష్కరించాలని ఎస్పీని కోరుతున్న వృద్ధురాలు

నెల్లూరు(క్రైమ్): 'మా సమస్యలకు క్షేత్రస్థాయిలో పరిష్కారం దొరకడం లేదు. మీరైనా విచారించి న్యాయం చేయండి' అంటూ పలువురు బాధితులు ఎస్పీ జి.కృష్ణకాంత్‌ను కోరారు. నెల్లూరు ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 98 మంది విచ్చేసి తమ ఫిర్యాదులను ఎస్పీకి అందజేశారు. వాటిని పరిశీలించిన ఆయన ఆయా ప్రాంత పోలీస్ అధికారులతో మాట్లాడారు. సత్వరమే బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. సమస్యల పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. డీటీసీ, మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీలు గిరిధర్, చెంచు రామారావు, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులురెడ్డి, ఎస్బీ ఇన్‌స్పెక్టర్లు వెంకటేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి, ఫిర్యాదుల సెల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వినతుల్లో కొన్ని..

- ఆస్తి కోసం కొడుకు, కోడలు చిత్రహింసలు పెడుతున్నారు. నా పేరుపై ఉన్న స్థలం, పొలం వారికివ్వలేదని ఇంటి నుంచి గెంటేశారు. విచారించి న్యాయం చేయాలని ఓ వృద్ధురాలు అభ్యర్థించింది.
- ట్రేడింగ్‌లో డబ్బు పెడితే అధిక వడ్డీ ఇస్తానని కావలికి చెందిన మహబూబ్ సుభాని నమ్మించాడు. అతడి మాటలు నమ్మి రూ.11.80 లక్షలు ఇచ్చాను. ఇంత వరకూ వడ్డీ, అసలు ఇవ్వకుండా బెదిరిస్తున్నాడు. విచారించి న్యాయం చేయాలని జలదంకికి చెందిన ఓ యువకుడు కోరాడు.
- కాస్మొటిక్ షాపు పెట్టుకునేందుకు లైసెన్స్ ఇప్పిస్తానని నెల్లూరు దర్గామిట్టకు చెందిన మహ్మద్‌బాషా రూ.3.75 లక్షలు తీసుకున్నాడు. లైసెన్స్ ఇప్పించకుండా, నగదు తిరిగివ్వకుండా బెదిరిస్తున్నాడని వేదాయపాళేనికి చెందిన ఓ వ్యక్తి ఫిర్యాదు చేశాడు.
- నెల్లూరు నవాబుపేటకు చెందిన శేషయ్య, వెంకటేశ్వర్లురెడ్డిలు నా పూర్వీకుల నుంచి వచ్చిన ఆస్తిని ఆక్రమించుకున్నారు. ఆ స్థలానికి సంబంధించిన డాక్యుమెంట్లు నా వద్ద ఉన్నాయి. విచారించి వారిపై చర్యలు తీసుకోవాలని ఓ వృద్ధుడు కోరాడు.
- హైదరాబాద్‌కు చెందిన సాయికుమార్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి రూ.3.50 లక్షలు తీసుకున్నాడు. అప్పటికే మూసివేసిన కంపెనీ పేరు మీద నకిలీ నియామకపత్రాలిచ్చి మోసగించాడు. అతడిపై చర్యలు తీసుకోవాలని నవాబుపేటకు చెందిన ఓ యువకుడు ఫిర్యాదు చేశాడు.
- నా భార్యను కొడవలూరులోని ఆమె పుట్టింటిలో వదిలిపెట్టాను. ఆ తర్వాత ఆమె అదృశ్యమైంది. ఆచూకీ కనుక్కోవాలని సంగం ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి కోరాడు.

పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి


ధర్నా నిర్వహిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు తదితరులు

పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలంటూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గాంధీ బొమ్మ సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ జరిగింది. స్థలాలు లేని వారితో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర నాయకుడు ఆర్.వెంకట్రావు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కూటమి పెద్దలు అర్హులైన వారికి ఇళ్ల స్థలాలిస్తామని హామీ ఇచ్చారన్నారు. అయితే ఇప్పటివరకు స్థలాలు కేటాయించిన దాఖలాల్లేవన్నారు. ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందన్నారు. సంఘం జిల్లా కార్యదర్శి నందిపోగు రమణయ్య మాట్లాడుతూ విద్యాదీవెన ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే విద్యార్థులను యాజమాన్యాలు ఫీజు కోసం ఒత్తిడి చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో నాయకులు మాలకొండయ్య, రామరాజు, సయ్యద్ సిరాజ్, అజీజ్ అహ్మద్, కామేశ్వరరావు, విజయ్, జిలానీఖాన్, విజయమ్మ, సరోజిని, సంపూర్ణమ్మ, జ్యోతి, చిన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బా గాంధీ విద్యాలయ ఘటనపై కేసు నమోదు

కావలి: పట్టణంలోని ముసునూరులో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో జరిగిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కావలి రూరల్ పోలీస్ స్టేషన్ సీఐ జి.రాజేశ్వరరావు సోమవారం తెలిపారు. ప్రిన్సిపల్ సంధ్యారాణి ఫిర్యాదు మేరకు వేగంగా విచారణ జరుపుతున్నట్లు ఆయన వెల్లడించారు. కాగా విద్యార్థినులతో సీఐ మాట్లాడారు. విద్యాలయం ప్రాంగణం చుట్టూ రాత్రి వేళల్లో లైటింగ్ తక్కువ ఉంటుందని విద్యార్థినులు చెప్పారు. దీంతో దాతలతో మాట్లాడి ప్రాంగణంలో లైటింగ్ సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. కాగా ఎస్పీ జి.కృష్ణకాంత్ విచ్చేసి ప్రిన్సిపల్, విద్యార్థినులతో మాట్లాడారు. నిందితులను గుర్తించి అరెస్ట్ చేయాలని స్థానిక పోలీసులను ఆదేశించారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఉచిత శిక్షణ

నెల్లూరు రూరల్: ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు శిక్షణ ఇస్తామని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ మారుతి ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు స్థాపించేందుకు అవగాహన కల్పిస్తామన్నారు. 18 నుంచి 50 సంవత్సరాల్లోపు వయసున్న వారు అర్హులన్నారు. ఈనెల 12, 15, 17 తేదీల్లో బ్యాచ్‌లు మొదలవుతాయన్నారు. పూర్తి వివరాలకు 89852 78911, 89852 32755 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

మమ్మల్ని వీధిన పడేయొద్దు

- ఇళ్లు తొలగిస్తే ఎక్కడికెళ్లాలి?
- ప్రభుత్వం ప్రత్యామ్నాయం చూపకపోతే ఎలా?
- విడవలూరు గ్రామస్తుల నిరసన


తహసీల్దార్ కార్యాలయం వద్ద గ్రామస్తులు

విడవలూరు: 'లోన్లు తెచ్చుకుని, అప్పులు చేసి ఇళ్లు నిర్మించుకున్నాం. ముందస్తు సమాచారం ఇవ్వకుండా, ప్రభుత్వ స్థలాలంటూ వాటిని తొలగిస్తే మేము ఎక్కడికెళ్లి బతకాలి' అంటూ విడవలూరుకు చెందిన పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా విడవలూరులో రోడ్డుకిరువైపులా ఉంటున్నామని తెలిపారు. బుధవారం ఇళ్లు కూల్చేస్తారని తెలియడంతో తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి ఆరాతీయగా నిజమేనని తెలిసిందన్నారు. సమాచారం ఇవ్వకుండా ఇలాంటి చర్యలు తీసుకోవడం వెనుక ప్రభుత్వం ఉద్దేశం ఏమిటో తెలియడం లేదన్నారు. ఇళ్లు తొలగిస్తే రోడ్డున పడతామని, దయచేసి అధికారులు తమ నిర్ణయాన్ని మార్చుకోవాలని కోరారు. గతంలో కొన్ని గృహాలకు రెవెన్యూ అధికారులు పొజిషన్ సర్టిఫికెట్లు ఇచ్చారని, ఇంతకాలం తమతో కుళాయి, ఇంటి పన్ను కట్టించుకున్నారని వాపోయారు. ఇప్పుడు ఇళ్లు కూల్చేస్తామని చెప్పడం సరికాదన్నారు. తామంతా ఎక్కడుండాలో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రత్యామ్నాయం చూపకుండా ఇళ్లు కూల్చేసి 250 నిరుపేద కుటుంబాలను వీధిన పడేయొద్దని విజ్ఞప్తి చేశారు. అనంతరం తహసీల్దార్ చంద్రశేఖర్, ఆర్అండ్‌బీ ఏఈ చంద్రశేఖర్‌ను కలిసి మాట్లాడారు. రోడ్డు విస్తరణ కోసం ఎంతమేర స్థలం అవసరమో అంతే తీసుకోవాలని అధికారులు, పలువురు నేతలకు వినతిపత్రం అందజేశారు. కాగా ఈ వ్యవహారంపై తహసీల్దార్ మాట్లాడుతూ గుర్తుతెలియని వ్యక్తి విడవలూరు రోడ్డుకిరువైపులా స్థలం ఆక్రమణకు గురైందని లోకాయుక్తలో పిటిషన్ వేశారన్నారు. దీంతో ఆక్రమణలు తొలగించాలంటూ ఆదేశాలు వచ్చాయన్నారు. దాని ప్రకారమే నడుచుకుంటున్నామని తెలియజేశారు.

గడ్డిమందు తాగి యువకుడి ఆత్మహత్య


వేణు (ఫైల్)

ఉదయగిరి: మండలంలోని గండిపాళేనికి చెందిన గోరంట్ల వేణు (24) అనే యువకుడు సోమవారం తెల్లవారుజామున గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. గండిపాళెం గ్రామానికి చెందిన వేణు తన సోదరుడితో కలిసి తెలంగాణలో సెంట్రింగ్ పనులు చేసేవాడు. అయితే నష్టాలు రావడంతో ఏడాదిన్నర క్రితం స్వగ్రామానికి వచ్చి బేల్దారి పనులకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో సెంట్రింగ్ సామగ్రి కోసం తెచ్చిన అప్పులు తీరకపోవడంతో మానసిక వేదనకు గురయ్యాడు. సోమవారం తెల్లవారుజామున ఇంట్లో ఉన్న కలుపు నివారణ (గడ్డి) మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వేణును పామూరు వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలులో ఓ ప్రైవేట్ వైద్యశాలకు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతిచెందారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందుకున్న ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై దాడి

కావలి: కావలి రూరల్ మండలం చెన్నాయపాళెం గ్రామం ఎస్సీ కాలనీలో ఆదివారం రాత్రి వైఎస్సార్‌సీపీ కార్యకర్త చొటూరు లక్ష్మణరావుపై టీడీపీ కార్యకర్తలు దాడి చేశారు. గాయపడిన బాధితుడిని కుటుంబ సభ్యులు కావలిలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. తనపై ఒట్టికాల వెంకటేశ్వర్లు, శ్రీను, బ్రహ్మతేజ, పెద్ద వెంకటేశ్వర్లు, వాణి, బుజ్జమ్మలు దాడి చేశారని లక్ష్మణరావు తెలిపారు. ఈ ఘర్షణకు ఎస్సీ కాలనీలోని పరుసు సురేష్, రవి కారణమని బాధితుడు ఆరోపించాడు.

ముగిసిన రాష్ట్రస్థాయి మహిళా హాకీ పోటీలు


విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న నిర్వాహకులు

- విజేతగా నిలిచిన వైఎస్సార్ జిల్లా జట్టు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో హాకీ నెల్లూరు జిల్లా ఆధ్వర్యంలో మూడు రోజులుగా జరుగుతున్న 15వ హాకీ ఆంధ్రప్రదేశ్ సీనియర్ మహిళా చాంపియన్‌షిప్ పోటీలు సోమవారంతో ముగిశాయి. ఫైనల్స్, 3, 4 స్థానాల కోసం మ్యాచ్‌లను నిర్వహించారు. అనంతపురం జట్టుపై వైఎస్సార్ జిల్లా జట్టు విజయం సాధించింది. మూడో స్థానంలో కాకినాడ జట్టు నిలిచింది. విజేత జట్టుకు ట్రోఫీ, రూ.7 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన అనంతపురం జట్టుకు రూ.5 వేలు, కాకినాడ జట్టుకు రూ.3 వేలు ప్రోత్సాహక బహుమతి అందజేశారు. ప్రకాశం జిల్లా జట్టుకు చెందిన నందిని ఉత్తమ గోల్‌కీపర్‌గా ఎంపికవగా రూ.1,000 బహుమతిగా ఇచ్చారు. కాకినాడకు చెందిన వరాలమ్మకు ఉత్తమ క్రీడాకారిణి అవార్డు, రూ.1,000 నగదు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ జోనాతాన్, హాకీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు బీఎం చాణుక్యరాజు, కార్యదర్శి హర్షవర్ధన్, కోశాధికారి పి.థామస్ పీటర్, వివిధ జిల్లాల హాకీ కార్యదర్శులు, డాక్టర్ మల్లికార్జునరావు, కౌన్సిలర్ శ్రీనివాసులు, సూర్యప్రకాష్, రవిచంద్ర, అనిల్, శేఖర్, జీడీ సురేష్‌బాబు, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.40
సన్నవి : రూ.25
పండ్లు : రూ.18

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్) : 108
లేయర్ (లైవ్) : 85
బ్రాయిలర్ చికెన్ : 200
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 224
లేయర్ చికెన్ : 145

కారుణ్య నియామకాల ఉత్తర్వుల అందజేత


నియామక ఉత్తర్వులను అందుకున్న వారు

నెల్లూరు(అర్బన్): వివిధ ప్రభుత్వ శాఖల్లో ఆరుగురికి సోమవారం కలెక్టర్ ఆనంద్ కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు కల్పించారు. అందుకు సంబంధించిన ఉత్తర్వులను లబ్ధిదారులకు డీఆర్వో ఉదయభాస్కర్‌రావు, కలెక్టరేట్ ఏఓ విజయకుమార్ అందజేశారు. బి.జ్ఞానదీప్, ఎస్కే ఆసిఫ్‌లను రెవెన్యూ విభాగంలో జూనియర్ అసిస్టెంట్లుగా, ఎస్.మాధవరావును పంచాయతీరాజ్ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా, శ్రీతేజ్‌ను పంచాయతీరాజ్ విభాగంలో గ్రేడ్-5 సెక్రటరీగా, పి.మెలీస్‌బాబును రెవెన్యూ విభాగంలో గ్రేడ్-2 వీఆర్వోగా, ఎం.సుమను పంచాయతీరాజ్‌లో ఆఫీస్ సబార్డినేట్‌గా నియమించారు.

టిప్పర్ ఢీకొని వ్యక్తి మృతి


మల్లికార్జున (ఫైల్)

దుత్తలూరు: ఓ వ్యక్తి రోడ్డు పక్కన కూర్చొని ఉండగా టిప్పర్ ఢీకొని మృతిచెందిన ఘటన మండలంలోని నర్రవాడ పంచాయతీ మజారా గ్రామమైన వడ్డిపాళెం సమీపంలో ఆదివారం రాత్రి జరిగింది. ఎస్సై పి.ఆదిలక్ష్మి సోమవారం వివరాలు వెల్లడించారు. పచ్చవ మల్లికార్జున (35) వడ్డిపాళెం వాసి. అతను గ్రామంలోని వెంగమాంబ గుడికెళ్లే చెరువుకట్ట దారిలో రోడ్డు పక్కన కూర్చొని ఉన్నాడు. ఈ నేపథ్యంలో టిప్పర్ మల్లికార్జునను ఢీకొట్టింది. కుటుంబ సభ్యులు గుర్తించి క్షతగాత్రుడిని ఉదయగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. డాక్టర్లు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లుగా నిర్ధారించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన టిప్పర్‌ను స్టేషన్‌కు తరలించారు.